


సిద్దిపేటలో ఓటుహక్కును వినియోగించుకున్న మహిళ


సిద్దిపేటలోని భరత్‌నగర్‌లో ఓటువేయడానికి లైన్‌లో నిల్చున్న ఓటర్లు

ఓటెత్తారు

మెదక్ పార్లమెంటులో 73.63 శాతం పోలింగ్

- గత ఎన్నికల్లో 71.71 శాతం మాత్రమే నమోదు
- నర్సాపూర్‌లో అధికం.. పటాన్‌చెరులో అత్యల్పం
- మందకొడిగా మొదలై బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల ఘర్షణలు..
- ఓటేసిన మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు
- వాతావరణం అనుకూలతతో పెరిగిన ఓటింగ్
- స్ట్రాంగ్‌రూముల్లోకి ఈవీఎంలు


సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోని బండలో వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో వృద్ధురాలిని పోలింగ్ బూత్‌లోకి తీసుకెళుతున్న కానిస్టేబుల్

మండుటెండల నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ శాతం తగ్గుతుందని అంతా భావించారు. కానీ, వాతావరణం చల్లబడిన కారణంగా అనూహ్య రీతిలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. మందకొడిగానే పోలింగ్ సరళి మొదలైనప్పటికీ ఆ తర్వాత ఊపందుకున్నది. ఏ కేంద్రంలో చూసినా ఓటేసేందుకు బారులు తీరి కనిపించారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల కంటే పోలింగ్ శాతం పెరిగింది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మే 13 : ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 71.71 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 73.63 శాతం నమోదు కావడం విశేషం. ఎన్నికలు సజావుగా జరిగేలా ఎక్కడికక్కడ పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్లు, జిల్లాల కలెక్టర్లు పలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగు రూముల్లో భద్రపరచడానికి తరలించారు.

కలిసొచ్చిన వాతావరణం..

మొన్నటిదాకా ఉగ్రరూపం దాల్చిన మండుటెండలు ఒక్కసారిగా కనుమరుగయ్యాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. దీంతో ఓట్లు వేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. ఎండలకు భయపడి అభ్యర్థులే తమ కార్యక్రమాలను రద్దు చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎందుకంటే మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అభ్యర్థులు తమ ప్రచారాలను కుదించుకోక తప్పలేదు. కాగా ఇదే ప్రభావం పోలింగ్‌పైనా పడుతుందని అంతా భావించారు. కానీ వాతావరణం పూర్తిగా అనుకూలించడంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. గత ఎన్నికల కంటే ఎక్కువగా నమోదు కావడంతో ఎవరికి వారు పెరిగిన ఓట్లు తమకే లాభిస్తాయనే ధీమాతో ఉన్నారు.

ఓటేసిన ప్రముఖులు..

చింతమడకలో మాజీ సీఎం కేసీఆర్, సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, దుబ్బాక మండలం పోతారంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇదే మండలం బొప్పాపూర్‌లో మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు, చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, గోనెపల్లిలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సిద్దిపేటలో మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటర్ల తికమక

మెదక్ లోక్‌సభ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులతో కలుపుకుని మొత్తం 44 మంది పోటీలో నిలిచారు. ఫలితంగా ఒక్కో పోలింగ్ బూత్‌లో 3 ఈవీఎంలను ఏర్పాటు చేశారు. నోటాతో కలుపుకుని మొత్తం 44 గుర్తులు ఉండగా.. ఓటర్లు చిహ్నాలను గుర్తించడం కష్టంగా మారింది. ఓటు వేయడానికి కనీసం 2 నుంచి 3 నిమిషాల సమయం పట్టిందని ఓటర్లు పేర్కొన్నారు.


బొప్పాపూర్‌లో ఓటేసిన మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు


తెల్లాపూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి


చిట్కుల్‌లో ఓటేసిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు


చింతమడకలో ఓటేసిన అనంతరం వేలికున్న సిరాను చూపిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

మెదక్ పార్లమెంట్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ శాతం

నియోజకవర్గం	శాతం
నర్సాపూర్	83.73
మెదక్	79.61
దుబ్బాక	80.22
సిద్దిపేట	73.15
గజ్వేల్	79.07
పటాన్‌చెరు	61
సంగారెడ్డి	68.48

ప్రాథమిక సమాచారం మేరకు..


ఓటేయడానికి వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధుడు



అభ్యంతరాలు.. ఘర్షణలు

- చిన్నకోడూరులోని 211,212 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలపై కారు గుర్తు ఎదురుగా ఉన్న బటన్‌పై సిరా ఇంకు ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేయగా ఎన్నికల సిబ్బంది ఈ ఇంకు మరకను తొలగించారు.
- చేర్యాల పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్దకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రావడంతో కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఇరుపార్టీల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది.
- ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు రాకేశ్‌రెడ్డిను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల నడుమ బాహాబాహీ చోటుచేసుకుంది.

మంత్రి పొన్నం ఆర్టీసీ బస్సులో ప్రయాణం

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ నుంచి ప్రయాణికులతో కలిసి వెళ్లి.. ఓటు వేశారు. ఓటు వేసిన తర్వాత రోడ్డు పక్కన హోటల్‌లో టీ తాగారు. అనంతరం హుస్నాబాద్ నుంచి బస్సులో చిగురుమామిడికి వెళ్లారు.

భువనగిరి పార్లమెంట్ పరిధిలో...

చేర్యాల, మే 13 : భువనగిరి పార్లమెంట్ పరిధి సిద్దిపేట జిల్లాలో ఉన్న చేర్యాల, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. చేర్యాల మండలంలో 45,948 మంది ఓటర్లు ఉండగా, 33,225మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కొమురవెల్లి మండలంలో 15,322 మంది ఓటర్లు ఉండగా 11,816 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నప్పటికీ బీఆర్ఎస్ ఓటర్లకు ఈసారి డబ్బు పంపిణీ చేపట్టలేదు. ఇంకో పార్టీ ఓటుకు రూ.200చొప్పున, మరోపార్టీ పలు కులసంఘాలకు రూ.10వేల చొప్పున పంపిణీ చేయడంతో పోలింగ్ సరళిలో మార్పు సంభవించింది. పార్టీల మధ్య పోటాపోటీ వాతావరణం లేకపోవడంతో పాటు వలస ఓటర్లు ఆశించిన మేర రాకపోవడంతో అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా పోలింగ్ జరిగింది.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో...

హుస్నాబాద్, మే 13 : కరీంనగర్ పార్లమెంట్ పరిధి సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలో 2,47,701 మంది ఓటర్లు ఉండగా 1,91,804 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత వల్ల ఓటర్లు ఎవరూ రాకపోవడంతో పోలింగ్ కేంద్రాలు బోసిపోయాయి. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఓటర్లు కేంద్రాలకు పోటెత్తారు. నియోజకవర్గంలో గత అసెంబ్లీ కంటే ఈసారి పోలింగ్ శాతం తగ్గింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 84.65శాతం నమోదుకాగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 77.43 శాతం పోలింగ్ నమోదైంది.

పండుగ వాతావరణంలో పోలింగ్

- కలెక్టర్ మనుచౌదరి


దుద్దెడ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ, అధికారులు

కొండపాక, మే 13 : ఎన్నికలు పండుగ వాతావరణంలో జరిగాయని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వీల్‌చైర్‌తో పాటు పాటు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చెదురుముదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగాయన్నారు. దుద్దెడ పోలింగ్ కేంద్రంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటేసేందుకు ఎల్లలు దాటి..


ఓటు వేశాక సిరాగుర్తును చూపుతున్న సురేందర్‌రెడ్డి, స్రవంతి దంపతులు


బచ్చు శ్రావణ్‌కుమార్

గజ్వేల్/రాయపోల్, మే 13: వీధి చివర్లో పోలింగ్ కేంద్రం ఉన్నా ఓటేసేందుకు అనేక మంది బద్ధకిస్తున్న తరుణంలో కొందరు అమెరికా నుంచి వచ్చి ఓటేసి ఆదర్శంగా నిలిచారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన చేతిరెడ్డి సురేందర్ రెడ్డి-స్రవంతి దంపతులు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేయడానికి అమెరికా నుంచి వచ్చారు. ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడిన దంపతులు ప్రజ్ఞాపూర్‌లోని బూత్ నెంబర్ 210లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ కుమారుడు బచ్చు శ్రావణ్ కుమార్ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి అమెరికా నుంచి శనివారం గ్రామానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు.

ఎవరి ధీమా వారిదే..

హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారంతో మెదక్ పార్లమెంటు పోరు రసవత్తరంగా మారింది. అయితే, పోలింగ్ సరళితో తమ భవితవ్యం బయటపడుతుందని అభ్యర్థులు భావించారు. ఓటర్లు అంతుబట్టకుండా వ్యవహరించడంతో అభ్యర్థులు సైతం అయోమయానికి గురవుతున్నారు. పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు ఎవరికి వారు విజయంపై ధీమాతో ఉన్నారు. తన వ్యక్తిగత హామీలతోపాటు బీఆర్ఎస్ క్యాడర్ విస్తృతంగా పనిచేసిన ఫలితం పోలింగ్‌లో కనిపించిందని ఆ పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విశ్వసిస్తున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల ప్రభావం స్పష్టంగా కనిపించిందని ఆ పార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. ఇక ఎన్నడూ లేనంతగా పోలింగ్ సరళి ద్వారా స్పష్టమైన సంకేతాలు ప్రస్ఫుటమయ్యాయని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అభిప్రాయపడుతున్నారు. ఇలా ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. అయితే పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనూ విభిన్నమైన పరిణామాలు, పరిస్థితులు ఉండడంతో అభ్యర్థులు సైతం ఎటూ తేల్చుకోలేక గెలుపుపై నమ్మకంగా ఉన్నారు.

కొత్త ఓటర్ల సంబరం
7లో

పలు ప్రాంతాల్లో మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్
- ఇబ్బందిపడ్డ ఓటర్లు

కరీంనగర్ పార్లమెంట్‌లో మండలాల వారీగా పోలింగ్ శాతం

మండలం	శాతం
హుస్నాబాద్	77
అక్కన్నపేట	77.87
కోహెడ	79.63
బెజ్జంకి	75.02

భువనగిరి పార్లమెంట్‌లో మండలాల వారీగా పోలింగ్ శాతం

మండలం	శాతం
చేర్యాల	72.31
కొమురవెల్లి	77.11
మద్దూరు	74.25
దూళిమిట్ట	75.32


హుస్నాబాద్‌లో ఓటు వేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు


సిద్దిపేట పట్టణంలోని అంబిటస్ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దంపతులు


పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను తీసుకుని వస్తున్న సిబ్బంది


చింతమడక గ్రామంలో బారులు తీరిన ఓటర్లు

కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్



నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, మే 13: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని కాంగ్రెస్ జహీరాబాద్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. శాసన సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నాడని, కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగతా గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసన సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, అందువల్ల తాను గెలవడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

రసాయన ఎరువులతో చేటు!

- మోతాదుకు మించి వాడుతున్న రైతులు
- సహజత్వాన్ని కోల్పోతున్న నేల
- సేంద్రియ ఎరువుల వాడకంపై రైతుల అనాసక్తి
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



యాచారంలో పొలాన్ని చదును చేసిన రైతు

సిద్దిపేట, మే 13 : అధిక దిగుబడి సాధించేందుకు రైతులు విరివిగా రసాయన ఎరువులు వాడుతున్నారు. పశువుల పేడ, గొర్లు మేకల ఎరువు, వర్మి కంపోస్టు, వాన పాముల ఎరువుల తదితర సహజ ఎరువులు వాడకపోవడంతో రోజురోజుకూ భూసారం తగ్గుతోంది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం నేల సహజ స్వరూపాన్ని మార్చేస్తోంది. రసాయనాల ప్రభావంతో భూమిలోని ముతక లోహాలు క్షీణిస్తున్నాయి. ఇది మున్ముందు ప్రమాదకరం పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూసార పరీక్ష కేంద్రాలు అందుబాటులోకి వచ్చినా ఎక్కువ మంది రైతులు తమ భూమిలో మట్టి పరీక్షలు చేయించడం లేదు. మట్టి పరీక్షలు చేయిస్తే ఏ ఎరువులు ఎంత మేర వాడాలనే లెక్క ఉంటుంది. భూసార పరీక్షలతో కలిగే లాభాల గురించి రైతులకు చెబుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యవసాయ అధికారులు వాపోతున్నారు.

గ్రామ స్థాయిల్లో పరీక్షలు చేస్తే మేలు!

నేడు ప్రతీ మండలంలో రైతు వేదికలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, అక్కడ భూసార పరీక్షలు చేసే కిట్లను ఉంచడం లేదు. డివిజన్ పరిధిలోనో లేక మరెక్కడో కాకుండా క్లస్టర్ రైతు వేదికల్లో అయినా భూసార పరీక్షల నిర్వహిస్తే గ్రామాల్లోని చాలా మంది తమ పొలాల మట్టిని సేకరించి పరీక్ష చేయించే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఎక్కడో దూరానికి మట్టిని తీసుకుళ్లడం, మట్టి పరీక్ష ఫలితాల కోసం చాలారోజుల పాటు వేచి చూడడం వంటి పరిస్థితుల వల్లే రైతులు భూసార పరీక్షలకు పెద్దగా ఆసక్తి చూడపం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించక కూడా భూమి సహజత్వాన్ని కోల్పోతోంది. ఏడాదిలో ఒక భూమిలో కనీసం రెండే వేర్వేరు పంటలు పండించాలి. అలా చేస్తేనే అన్ని రకాల సారం పంటలకు అంది దిగుబడి పెరుగుతుంది. అలాగే రసాయన ఎరువుల వాడకం తగ్గే ఆస్కారం ఉంటుంది. వరి సాగుకు ఎకరానికి ఒక బస్తా యూరియా వాడాలి. రైతులు మూడు, నాలుగు బస్తాలు చల్లుతున్నారు. సహజ ఎరువులను ఎంత వాడినా నేల స్వభావం మారదని, కానీ రసాయ ఎరువుల ఎంత ఎక్కువ వాడితే నేల అంత పాడై రానురాను మొక్కల ఎదుగులే లేకుండా పోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నేలకు సారాన్నిచ్చే చెరువు, కుంటల మట్టి

మెట్ట పంటలకు టిక్కిమట్టితో పాటు పశువులపేడ, మేకల, గొర్రెల ఎరువు, కోడి ఎరువు వాడితే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. టిక్కి మట్టిలో హ్యూమస్ ఉండి నేల సారవంతంగా మారుతుందన్నారు. ఎలాంటి నేలనైనా పంటలకు అనుగుణంగా మార్చే శక్తి చెర్లు, కుంటల్లోని మట్టికి ఉంటుందన్నారు. చెరువులు ఎండిపోయిన ఇలాంటి సందర్భాల్లో ప్రతీ ఎకరానికి వంద నుంచి 150 టిప్పుల ట్రాక్టర్ల మట్టిని తోలుకోవాలని సూచించారు. ఇలా చేస్తే నేల పైపొర సారవంతగా మారుతుంది. అలాగే పొలంలో తేమ ఎక్కువ రోజులు ఉంటుంది. పొలంలో మట్టి కొట్టుకుంటే పంటలకు యూరియా, పొటాషియం ఎరువుల తక్కువ మోతాదులో వేసుకున్నా దిగుబడి వస్తుంది. టిక్కిమట్టిలో ఉదజని7.4శాతం, నత్రజని 108.33శాతం, భాస్వరం 43.3శాతం, పొటాషియం 227.15 శాతం ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆవు పేడలో 40శాతం న్యూట్రిషన్, 20శాతం పొటాషియం, 10శాతం కాల్షియం ఉంటుందన్నారు. ఇవన్నీ నేలకు సారాన్ని ఇచ్చేవే అన్నారు. పైగా సహజ విధానంలో వాటిని చేకూర్చడం ద్వారా పంట నాణ్యత కూడా బాగుంటుందని చెబుతున్నారు.



వృథాగా పశువుల ఎరువు



ఆలయాల్లో హరీశ్ ప్రత్యేక పూజలు

చిన్నకోడూరు, మే 13: మండలంలో గంగాపూర్ బీరప్ప స్వామి, మాచాపూర్‌లోని ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీరప్ప స్వామి, ఎల్లమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ:సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సిద్దిపేట అభివృద్ధిలో దినదినాభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆలయాల ప్రతినిధులు హరీశ్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గౌడ సంఘం, కురుమ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ కోసం ఉద్యోగుల ఆందోళన

భత్యం తక్కువ ఇస్తున్నారంటూ ఆగ్రహం

నారాయణఖేడ్, మే 13: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంల రిసీవింగ్ పాయింట్ల వద్ద ఆందోళనకు దిగారు. నారాయణఖేడ్‌లో భత్యం తక్కువ ఇస్తున్నారని, గజ్వేల్‌లో ఏఆర్వోతో ఉన్న వ్యక్తులు దూషించారని ఆందోళనకు దిగారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు చెల్లించాల్సిన భత్యం తక్కువగా ఇస్తున్నారంటూ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. నారాయణఖేడ్ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులు ముగించుకొని సోమవారం రాత్రి ఈవీఎంలు, వీవీప్యాట్, ఇతర సామగ్రితో తిరిగి వచ్చిన ఉద్యోగులు కేంద్రంలో వాటిని అధికారులకు అప్పగించారు. అనంతరం ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకంగా ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఇక్కడ తక్కువగా ఇస్తున్నారని ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసుల రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న ఉద్యోగులను చెరదగొట్టారు. దీంతో కొద్దిసేపు రిసీవింగ్ పాయింట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

గజ్వేల్‌లో గలాట..

గజ్వేల్, మే 13: గజ్వేల్ ఐఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పీవో, ఏపీవోలు ఏఆర్వోతో ఘర్షణకు దిగారు. ఏఆర్వో వెంట ఉన్న వ్యక్తులు దుర్భషలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలో ఉంటే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్, ఇతర అధికా రులు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

పిల్లలపై బెంగతో వివాహిత ఆత్మహత్య

మనోహరాబాద్, మే 13: పిల్లలపై బెంగతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాళ్లకల్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం, గాన్‌సోర్ జిల్లా, సాత్ ఇపాని మండలం, గౌటియాటోలా గ్రామానికి చెందిన జైన్‌లాల్ వర్కడే.. అదే రాష్ట్రానికి చెందిన సిమ్లాను పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అదే రాష్ట్రం సియోని జిల్లా సాల్‌హేపని మండలం, బజ్‌గొండ్ గ్రామానికి చెందిన ఊర్మిళ(30) అనే మహిళను కూడా మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఊర్మిళకు అప్పటికే వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే, మొదటి భార్య సిమ్లా, ఆమె పిల్లలు, ఊర్మిళ పిల్లలు జైన్‌లాల్ వర్కడే తల్లిదండ్రుల వద్ద మహారాష్ట్రలోనే ఉంటున్నారు. జైన్‌లాల్, ఊర్మిళ మాత్రం 18 నెలల క్రితం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి వచ్చి అద్దెకుంటూ ప్రైవేట్ పరిశ్రమలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఊర్మిళ తరచూ పిల్లలను తలుచుకుంటూ బాధపడేది. ఆదివారం సాయంత్రం జైన్‌లాల్ డ్యూటీకి వెళ్లి రాత్రి రాగా.. ఊర్మిళ ఉరేసుకుని కనిపించింది. చుట్టుపక్కల వారి సహాయంతో వెంటనే తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. పరిశీలించిన వైద్యులు మృతిచెందిందని చెప్పారు. పిల్లలపై బెంగతో ఊర్మిళ ఆత్మహత్య చేసుకున్నట్లు జైన్‌లాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్థాపంతో వృద్ధుడి ఆత్మహత్య

తూప్రాన్, మే 13: తూప్రాన్ పట్టణ సమీపంలోని హల్దీవాగులో సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన ఓ వృద్ధుడి శవం లభ్యమైనట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన చీర్ల ఆగమయ్య (65) భార్య గతంలోనే మృతిచెందగా, ఓ పెళ్లీడుకొచ్చిన కూతురుంది. కూతురు వివాహం విషయంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఆగమయ్య ఆదివారం ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. సోమవారం తూప్రాన్ పట్టణ శివారులో హల్దీవాగు 44వ జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి కింద ఆగమయ్య శవం గుర్తించారు. మొదట గుర్తుతెలియని శవంగా పేర్కొనగా, మృతుడి ఫోటోల ఆధారంగా ఆగమయ్యగా గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

చిన్నశంకరంపేట, మే 13: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి.. ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాల మేరకు గ్రామానికి చెందిన సాయి (35) ఆర్థిక ఇబ్బందులు తాళలేక మన స్థాపానికి గురై రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమ్మిత్తం హైదరబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్యా సంగీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండాలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

● ముల్లుపల్లితండాలో గిరిజనుల నిరసన



ముల్లుపల్లితండాలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

శివ్వంపేట, మే 13: మండల పరిధిలోని ముల్లుపల్లితండా పంచాయతీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకుండా పంచాయతీ పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో గిరిజనులు మల్లుపల్లితండాలో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి తండాలో వచ్చే ఎన్నికల వరకు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తేనే ఓటు వేస్తామని నిరాకరించారు. కాగా అధికారులు స్పందించకపోవడంతో మధ్యాహ్నం తర్వాత గిరిజనులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ 70 శాతం ఓట్లు ఉన్న తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకుండా మల్లుపల్లిలో ఏర్పాటు చేయడంతో కిలోమీటర్ మేర నడుచుకుంటూ వెళ్లి ఓటు ఓటు వేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కోడ్ ఉల్లంఘనపై కేసులు

రాయపోల్, మే 13: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాయపోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి నాలుగు కేసులు నమోదయ్యాయని రాయపోల్ ఎస్ఐ రఘుపతి పేర్కొన్నారు. వడ్డెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు గుమ్మడి లింగం వద్ద 56 మద్యం బాటిళ్లు, గుమ్మడి వెంకట్ వద్ద 48 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఓటర్లకు పంచేందుకు తేవడంతో కేసు నమోదు చేసి మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. అలాగే చిన్నమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆవుల కొండల్‌రెడ్డి వద్ద 37 రాయల్ స్టాగ్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రామారం గ్రామంలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు రెడ్డబోయిన నరేష్, లకుమల్ల భూదయ్య, పెరుమాళ్ల స్వామిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.15,210 సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మర్వెల్లిలో ఘర్షణ, పలువురికి గాయాలు

వట్‌పల్లి మే 13: మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో స్వల్ప ఘర్షణ చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మర్వెల్లి చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎదురెదురు పడడం, ఒకరికొకరు దూషించుకోవడంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో మర్వెల్లి ఎంపీటీసీ సంగప్పకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఈ విషయమై ఎస్ఐ కోటేశ్వరరావును వివరణ కోరగా ఇరువర్గాలకు చెందినవారు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఓటేసిన ప్రముఖులు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.



నారాయణఖేడ్‌లోని 180వ బూత్‌లో తన సతీమణి అనుపమ్మరెడ్డితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి


ఝరాసంగంలో కుటుంబసమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు


శివ్వంపేట మండలం గోమారంలో కుటుంబీకులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


దుబ్బాక మండలం పోతారం గ్రామంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


సంగారెడ్డి కలెక్టరేట్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


సంగారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటేసిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ దంపతులు


దౌల్తాబాద్ పోలింగ్ వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి


దుబ్బాకలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి విజయభాస్కర్‌రెడ్డి


పటాన్‌చెరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


మిరుదొడ్డి: అందెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్


అందోలు మండలం డాకూరులో ఓటేసిన సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి


రామాయంపేట: కోనాపూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి


చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే రోహిత్ దంపతులు


హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లిలో కుటుంబసభ్యులతో ఓటేసిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి


నర్సాపూర్‌లో ఓటేసిన మిత్రులు


చిరాగ్‌పల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ


గజ్వేల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి దంపతులు


మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేటలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు మొరాయించాయి. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చేయించడంతో తిరిగి పోలింగ్ ప్రక్రియ కొనసాగింది.

●**చేర్యాల:** మండలం ఆకునూరు గ్రామంలోని పోలింగ్‌బూత్ నెం.32లో పోలింగ్ ప్రారంభ సమయంలో సాంకేతిక లోపంతో ఈవీఎం పనిచేయలేదు. దీంతో సుమారు గంటపాటు ఓటింగ్ నిలిచిపోయింది. అలాగే కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామంలోని పోలింగ్‌బూత్ నెం.21లో వీవీప్యాడ్ మిషన్ మొరాయించడంతో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. అనంతరం మరమ్మతులు చేపట్టడంతో యథావిధిగా ఓటింగ్ కొనసాగింది.


సిద్దిపేటలో ఓటేసేందుకు వస్తున్న దివ్యాంగుడు

●**కంది:** మండల కేంద్రమైన కందిలోని జడ్పీహెచ్‌ఎస్‌లోని పోలింగ్ కేంద్రంలో, వడ్డనగూడతండాలో, ఇంద్రకరణ్‌లో 20 నిమిషాల పాటు ఈవీఎం మిషన్లు మొరాయించాయి. వెంటనే ఎన్నికల అధికారులు వాటిస్థానంలో వేరే ఈవీఎంలను ఏర్పాటు చేయడంతో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది.

●**రేగోడు:** రేగోడు 14వ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు ఈవీఎం మొరాయించింది. అరగంట పోలింగ్ నిలిచిపోవడంతో ఓటేసేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బందిపడ్డారు.

● **మాసాయిపేట:** మాసాయిపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 25వ బూత్‌లో ఈవీఎం ఉదయం నుంచి మూడుసార్లు మొరాయించింది. సాయంత్రం మరమ్మతు చేయడంతో పోలింగ్ ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది.

●**హత్నూర:** హత్నూరలోని 223 పోలింగ్ బూత్‌లో 30 నిమిషాలు, చీక్‌మద్దూర్ 214 పోలింగ్ కేంద్రంలో 20 నిమిషాలు, పల్పనూర్, గుండ్లమాచునూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సైతం ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది.

●**పుల్‌కల్:** మండలం బొమ్మారెడ్డిగూడెంలో పోలింగ్ ప్రారంభ సమయంలో ఈవీఎం మొరాయించగా, అరగంట ఓటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. ఈవీఎంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని అధికారులు సరిచేశారు.

● **మునిపల్లి:** మునిపల్లి మండలం తాటిపల్లి గ్రామంలోని 278 బూత్‌లో మధ్యాహ్నం ఈవీఎం మిషన్ మొరాయించడంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. అక్కడే ఉన్న సెక్టోరల్ అధికారి దశరథ్ స్పందించి కొత్త మిషన్ ఏర్పాటు చేశారు.


చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో నేలపై కూర్చున్న ఓటర్లు

●**మద్దూరు:** మండలం లద్నూరులో 102 పోలింగ్ కేంద్రంలో 8.30 గంటల వరకు ఈవీఎం పనిచేయలేదు. సలాఖ్‌పూర్‌లో ఈవీఎం సతాయించింది. వల్లంపట్లలో పోలింగ్ మధ్యలో ఆగిపోవడంతో టెక్నికల్ సిబ్బంది సరిచేశారు. లద్నూరులో ఈవీఎం పనిచేయకపోవడంతో చాలాసేపటి వరకు ఓటర్లు వేచిఉన్నారు.

●**పాపన్నపేట:** పాపన్నపేట మండల కేంద్రం పాపన్నపేట 19వ బూత్‌లో రెండుసార్లు ఈవీఎం మొరాయించగా, నిపుణులతో సరిచేయించారు.

● **టేక్మాల్:** టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచ ప్రాథమికోన్నత పాఠశాలలో 84 పోలింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఈవీఎం మొరాయించింది. ఎట్టకేలకు ఈవీఎంను సరిచేయడంతో 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 8 గంటలకు ప్రారంభమైంది. నార్సింగి మండలం వల్లూరులోని 219 పోలింగ్ కేంద్రంలో ఉదయం 45 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించింది. అధికారులు సరిచేసి పోలింగ్‌ను యథావిధిగా కొనసాగించారు.

● **ధూళిమిట్ట:** దూళిమిట్ట మండలం గాజులపల్లిలోని 147 పోలింగ్ కేంద్రంలో సాంకేతిక సమస్యతో 30 నిమిషాలు అలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

● **బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని గుండారం, వడ్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఎన్నికల ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది.

● **హుస్నాబాద్ రూరల్:** హుస్నాబాద్ మండలంలో ఈవీఎంలు సతాయింపుతో రాత్రి 7 గంటల వరకు కూడా ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



లద్నూరులో ఈవీఎం పనిచేయకపోవడంతో వేచిఉన్న ఓటర్లు


మాసాయిపేటలో ఈవీఎం మిషన్ ఆగిపోవడంతో నిరీక్షిస్తున్న ఓటర్లు

సుతార్‌పల్లిలో ఓటేసేందుకు అనుమతికి నిరాకరణ

రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామంలో 5.59 నిమిషాలకు ఓటేసేందుకు వచ్చిన ఓటర్లను సిబ్బంది తిప్పి పంపటంతో గొడవ జరిగింది. బూత్‌లోకి వచ్చేసరికి సాయంత్ర 6 గంటలు దాటిందంటూ అనుమతించలేదు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మండలం బొల్లారంలో బీఆర్ఎస్ వారు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. కాంగ్రెస్ నాయకులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

కొత్త ఓటర్ల సంబరం

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న సందర్భం మరిచిపోని అనుభూతినిస్తుంది. ఎన్నికలు వచ్చినప్పుడు ఇంట్లో పెద్దలు ఓటేయడానికి వెళ్తుంటే నాకెప్పుడు ఓటు హక్కు వస్తుందా.? నేనెప్పుడు ఓటు వేస్తానని ఎదురుచూసిన యువతీ యువకులు ఎందరో ఉంటారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ సందర్భం రానే వచ్చింది. తొలిసారి ఓటరు జాబితాలో పేరు వచ్చిన యువత హుషారుగా పోలింగ్ కేంద్రానికి తరలివచ్చింది. ఓటు వేసి చేతి వేలికి వేసిన సిరా చుక్కను చూసుకుంటూ... సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు.

ఓటేశాం.. గొప్ప అనుభూతిని పొందాం


ఓటరు జాబితాలో నా పేరు చేర్చగానే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? ఎప్పుడు ఓటు వేస్తానని ఎంతో ఎదురుచూశా. ఉదయమే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ప్రజాస్వామ్యంలో ఎంపీని ఎన్నుకునే ప్రక్రియలో భాగమైనందుకు మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉన్నది.

- అనన్య, మెదక్

బాధ్యతగా భావించాలి


తొలి ఓటు వేసేందుకు ఎంతో ఆతృతతో ఎదురుచూశా. ఓటు వేశాక గొప్ప అనుభూతి పొందా. రాజకీయంలో మార్పు తీసుకురావాలంటే ఓటే ఒక వజ్రాయుధం. అభివృద్ధిని కాంక్షించే అభ్యర్థికే నా ఓటు. యువత బాధ్యతగా భావించి ముందుకు రావాలి.

- బండ అజితేజేష్, మెదక్

మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న..


పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్నందుకు ఆనందంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు రాలేదు. 18 ఏళ్లు నిండిన తర్వాత దరఖాస్తు చేసుకున్నాను. ఈ ఎన్నికల్లో ఓటువేసే అవకాశం లభించింది. ప్రతిఒక్కరూ తమ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. మనకు సేవచేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది.

- రేఖ, సిద్దిపేట

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం


ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం సంఘమిత్ర కళాశాలలో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ప్రతిఒక్కరూ ప్రలోభాలకు లొంగకుండా, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి.

- తేజస్విని, కత్తూరుపల్లి, సిద్దిపేట

ఓటేయడం ఆనందంగా ఉంది


పార్లమెంట్ ఎన్నికల్లో మొట్ట మొదటిసారిగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నందుకు ఆనందంగా ఉన్నది. సమాజంలో నాకూ ఓ హక్కు వచ్చిందని గర్వపడుతున్నాం. ఓటేయటంతో ఏదో సాధించామన్న సంతోషం మిగిలింది. ఈ ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పాటు కాబోయే ప్రభుత్వం విద్య, వైద్యంపై దృష్టిపెట్టాలి. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఆశిస్తున్నాం.

- మాలావత్ హారిక, మాలావత్ శ్వేత, నిజాంపేట

ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది


పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. తొలిసారి ఓటు రావడం, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఓటింగ్‌లో పాలుపంచుకోవడం గర్వంగా ఉంది. చదువుకున్న యువతను గుర్తించి సమన్యాయం జరిగేలా ఎన్నికైన ప్రభుత్వాలు చూడాలని కోరుతున్నాం.

- బిరేవి శ్రీజ, మిట్టపల్లి, సిద్దిపేట

ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది


మొదటిసారి ఓటు వేసేందుకు వచ్చాం. ముందుగా కొంత భయమేసింది. అధికారులు, ఇతరుల ప్రోత్సాహంతో ధైర్యంగా ఓటేసి తమ బాధ్యతను నెరవేర్చాం.

- శ్రీవాణి, శ్రీదేవి, అక్షిత, గుమ్మడిదల

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ

సిద్దిపేట క్రైం, మే 13: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోమవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సిద్దిపేటలోని అంబిటస్, నారాయణ స్కూల్ పోలింగ్ కేంద్రాలను, దుద్దెడ జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రజ్ఞాపూర్ హైస్కూల్, దౌల్తాబాద్ హైస్కూల్, సూరంపల్లి హైస్కూల్, దుబ్బాక ఎంపీడీవో ఆఫీస్‌లలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించి బందోబస్తు నిర్వహిస్తున్న అధికారులకు తగు సూచనలు సలహాలు చేశారు. అంబిటస్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఒక ఓ వృద్ధుడిని ఓటేసేందుకు ఇద్దరు తీసుకొస్తుండగా.. సీపీ చూసి అక్కడున్న సిబ్బందితో మాట్లాడుతూ వీల్‌చైర్ లేదా..? ఎందుకు వాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా పోలింగ్: ఐజీ రంగనాథ్

నర్సాపూర్, మే 13: నర్సాపూర్ పట్టణంలోని జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఐజీ రంగనాథ్, జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ పరిశీలించారు. ఓటర్లను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా భద్రతాపరమైన అంశాలను స్థానిక పోలీసులను అడిగి పలు సూచనలు చేశారు.


సిద్దిపేటలోని అంబిటస్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద సీపీ డాక్టర్ బి.అనురాధ


సిద్దిపేట టౌన్: బ్రిలియంట్ పాఠశాలలో కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్


సిద్దిపేట టౌన్: సెయింట్ జాన్స్ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ


సిద్దిపేట అర్బన్: వృద్ధులను పోలింగ్ కేంద్రానికి తీసుకువెళుతున్న అంగన్‌వాడీ ఆయాలు


చేర్యాలలో ఓటు వేసిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


చేర్యాల: నాగపురిలో ఓటు వేసిన ఎంపీపీ కరుణాకర్ దంపతులు


కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో ఓటు వేసిన ఎంపీపీ తలారి కీర్తనదంపతులు


దుబ్బాకలో ఓటరు స్లిప్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రామేశ్వర్


మిరుదొడ్డిలో క్యూలైన్లలో నిలబడిన ఓటర్లు


గజ్వేల్: జాలిగామలో ఓటు హక్కును వినియోగించుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు దంపతులు


గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులు


వర్గల్‌లో ఓటు వేసిన డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కుటుంబసభ్యులు



చేర్యాల: వీరన్నపేటలో ఓటు వేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి

జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్


కోహెడలో మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధుడు


ధూళిమిట్ట : కొండాపూర్ గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


మద్దూరు పోలింగ్ కేంద్రం వద్ద ఫొటో పాయింట్


నారాయణరావుపేట: రాఘవాపూర్ పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సమీర్ మాధవ్


నారాయణరావుపేట: గోపులాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీపీ బాలకృష్ణ కుటుంబం


దౌల్తాబాద్: ముబారస్‌పూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


నంగునూరులో కొత్తగా ఓటు హక్కును వినియోగించుకున్న యువత


హుస్నాబాద్ రూరల్: బల్లునాయక్‌తండాలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


చిన్నకోడూరు: గంగాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఉత్సాహంలో యువకులు


తొగుట: తుక్కాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పలు చోట్ల ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరగా, మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం నుంచి పోలింగ్ పుంజుకున్నది. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను గట్టి బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూంలకు తరలించారు.

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అర్బన్/ మే 13: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట పట్టణంతో పాటు అర్బన్, రూరల్ మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులను సిబ్బంది జాగ్రత్తగా పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లారు. సిద్దిపేట పట్టణంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పోలింగ్ బూత్ నంబర్ 134లో పార్టీ నాయకులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● **చేర్యాల:** భువనగిరి లోక్‌సభాస్థానం ఎన్నికల సందర్భంగా చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో మందకొడిగా పోలింగ్ సాగింది. ఉదయం వేగంగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నం కాస్త మందగించి సాయంత్రానికి పుంజుకుంది. చేర్యాల మండలంలో 72.31శాతం పోలింగ్ నమోదు కాగా, కొమురవెల్లి మండలంలో 77.11శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ కేంద్రంలో, టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి వీరన్నపేటలో, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ నాగపురిలో, కొమురవెల్లి మండల ఎంపీపీ తలారి కీర్తన మర్రిముచ్చాలలో, జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప కొమురవెల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్థానిక పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ పోలింగ్‌కేంద్రాన్ని సందర్శించిన క్రమంలో ఆయనతో కాంగ్రెస్ నేతలు అధికసంఖ్యలో వెళ్లడాన్ని గమనించిన బీఆర్ఎస్ కౌన్సిలర్ మంగోలు చంటి, వైస్ చైర్మన్ నిమ్మా రాజీవ్‌రెడ్డి అడ్డుచెప్పారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు కొమ్మూరి రాకేశ్ రెడ్డి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో కూర్చోవడం పట్ల సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. దుబ్బాక మండలంలోని పోతారం గ్రామంలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులతో ఓటుహక్కును వినియోగించారు. భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబసభ్యులతో ఓటును వేశారు. మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో పర్యావరణహిత పోలింగ్ మహిళా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

● **గజ్వేల్ :** గజ్వేల్ డివిజన్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. వర్షం వల్ల వాతావరణం చల్లబడటంతో ఓటర్లు ఉదయం పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గజ్వేల్ పట్టణంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జాలిగామలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, గజ్వేల్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజావిరాహత్‌అలీ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఓటుహక్కును వినియోగించుకున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పోలింగ్ స్టేషన్‌లతో పాటు మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సందర్శించారు.

● **వర్గల్:** మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 పోలింగ్ కేంద్రాలలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం పోలింగ్ ప్రారంభం కాగానే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. వర్గల్ పోలింగ్ కేంద్రంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తన కుటుంబ సభ్యులతో ఓటుహక్కుని వినియోగించుకున్నారు. యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● **దూళిమిట్ట:** దూళిమిట్ట మండలంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. మండల వ్యాప్తంగా దాదాపు 75 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా తెలిపారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువత నిర్వాహక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కొండాపూర్, హనుమతండా, దుబ్బాతండా గ్రామాల పరిధిలోని 18 తండాల ఓటర్లు దాదాపు 2,500 మందికి కేవలం పోలింగ్ కేంద్రాలు మాత్రమే కొండాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయడంతో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైరాన్‌పల్లి గ్రామంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి రాకేష్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం జరిగింది. పోలీసులు ఇరు వర్గాలను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించారు.

●**మద్దూరు:** మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతం జరిగింది. మండలంలో 22 పోలింగ్ కేంద్రాలుండగా 72.56శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు ఓటర్లు బారులు తీరారు. దివ్యాంగులను వలంటీర్లు వీల్‌చైర్‌లో ఓటింగ్ ప్రాంతానికి తరలించారు. ఓటేసేందుకు వచ్చే బాలింతలు పిల్లలకు పాలు పట్టేంచేందుకు ప్రత్యేకంగా టెంట్ రూం ఏర్పాటు చేశారు. కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించుకున్న వారికి ప్రత్యేకంగా 'నేను ఓటువేశాను.. మరి మీరు' అంటూ ఏర్పాటు చేసిన బోర్డు పలువురిని ఆకర్షించింది.

● **నారాయణరావుపేట:** మెదక్ పార్లమెంట్ ఎన్నికలు నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల వ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, నారాయణరావుపేట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సమీర్ మాధవ్ సందర్శించారు. మండలంలోని ఎంపీపీలు ఒగ్గు బాలకృష్ణ, శ్రీదేవి చందర్‌రావు, జడ్పీటీసీలు కుంభాల లక్ష్మిరాఘవరెడ్డి, శ్రీహరిగౌడ్‌లు వారి స్వగ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలాల్లో జరిగే పోలింగ్ సరళిని మాజీమంత్రి హరీశ్‌రావు ఆయా గ్రామాల్లో పర్యటించి నాయకులను అడిగి తెలుసుకున్నారు.

● **దౌల్తాబాద్:** మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల్లో వసతులతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగినప్పటికి వివిధ సమస్యలు తలెత్తాయి.వెంటనే అధికారులు అక్కడికి వచ్చి సమస్యను పరిష్కరించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియడంతో పోలింగ్ అధికారులు ఈవీఎంలతో పాటు వీవీప్యాట్ యంత్రాలను బాక్సుల్లో భద్రపరిచి, స్ట్రాంగ్ రూంలకు తరలించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు, సూరంపల్లిలో పోలింగ్ కేంద్రాలను సీపీ అనురాధ పరిశీలించి, క్యూలో నిలబడిన ఓటర్లను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

● **రాయపోల్:** మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాయపోల్ మండలంలో 84.97 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు.

●**జగదేవ్‌పూర్:**మండల వ్యాప్తంగా 18 గ్రామపంచాతీల్లో 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. దివ్యాంగులు, వృద్ధులకు పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లేందుకు వీల్‌చైర్‌లను ఏర్పాటు చేశారు.

● **చిన్నకోడూరు:** మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 48 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు చిన్నకోడూరు, పెద్దకోడూరు, మాచాపూర్, గంగాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. చిన్నకోడూరు, చంద్లాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎం.కె సమీర్ సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని చంద్లాపూర్‌లో జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ దంపతులు, గోనెపల్లిలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి దంపతులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● **నంగునూరు:** మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. మండల వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీల్లో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని నంగునూరు, బద్దిపడగ, నర్మెట్ట, పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. దర్గపల్లి జేపీ తండాలో జరిగిన చిన్న ఘర్షణలు తప్ప మండలవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు..

● **హుస్నాబాద్ రూరల్:** మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. 10 గంటల నుంచి ఓటు వేసేందుకు బారులు తీరారు. మండలంలోని మీర్జాపూర్, బల్లునాయక్‌తండా, వంగరామయ్యపల్లి, జిల్లెలగడ్డ, పందిళ్ల గ్రామాల్లో ఓటువేసేందుకు పోటీపడ్డారు. పొట్లపల్లి, కూచనపల్లి, మహ్మదాపూర్, గాంధీనగర్, నాగారం, ఉమ్మాపూర్ గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మడద, రాములపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రం 4 గంటల నుంచి ఓటు వేసేందుకు బారులు తీరారు.

● **బెజ్జంకి:** మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం సమయం నుంచి పుంజుకుంది. మండల కేంద్రంలో ఎంపీపీ నిర్మల, దాచారం గ్రామంలో జడ్పీటీసీ కవిత ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని రేగులపల్లి మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సిద్దిపేట డీపీవో దేవకీదేవి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, పోలింగ్ 75.2 శాతం నమోదైంది. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

● **తొగుట:** మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం పోలింగ్ 82 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల కేంద్రంలో పర్యావరణ హిత మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కొబ్బెర మట్టలతో తీర్చిదిద్దడం ఓటర్లను ఎంతగానో ఆకట్టుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతితో పాటు వృద్ధులకు ఓటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వీల్ చైర్లతో పాటు సహాయకులను ఏర్పాటు చేశారు. వెంకట్రావ్‌పేట గ్రామంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో కేంద్ర బలగాలతో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


మర్కుక్: వరదరాజ్‌పూర్‌లో నూతనంగా ఓటు వేసిన యువతులు


జగదేవ్‌పూర్: తిగుల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు


చిన్నకోడూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎంకే సమీర్, తహసీల్దార్ జయలక్ష్మి


తొగుట: లింగాపూర్‌లో ఓటు వేసిన ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి


బెజ్జంకిలో వృద్ధురాలిని ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో తీసుకొస్తున్న సిబ్బంది

గజ్వేల్‌లో పోటీ ఇవ్వలేకపోయిన జాతీయ పార్టీలు

జగదేవ్‌పూర్, మే 13: రెండు జాతీయ పార్టీలు గజ్వేల్‌లో పోటీ ఇవ్వలేకపోయాయని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాలలో బీఆర్ఎస్ మండల నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 12సీట్లు సాధించి కేంద్రంలో కీలకపాత్ర పోషించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంటు పరిధిలో గజ్వేల్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండా రంగారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎగ్బాల్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో పోలింగ్‌బూత్ పరిశీలన

ములుగు, మే 13: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డి భారీ మెజార్టీతో గెలువనున్నట్లు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నర్సాపూర్‌లో ఆయన పోలింగ్‌బూత్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఆయన వెంట మైనార్టీ రాష్ట్ర యువత విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్, ఎంపీటీసీ నవ్యశ్రీ రాజేందర్‌రెడ్డి, బాబురెడ్డి, కరుణాకర్ రెడ్డి, దశరథ, కనకయ్య, నాగేష్, అనిల్, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


జగదేవ్‌పూర్: ఇటిక్యాలలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

ఎంపీటీసీ బాబును పరామర్శించిన హరీశ్‌రావు

నంగునూరు, మే 13: నంగునూరు మండలం నర్మెట్ట గ్రామ ఎంపీటీసీ శనిగరం బాబు తండ్రి శనిగరం పోచయ్య ఇటీవల మృతి చెందగా సోమవారం సాయంత్రం మాజీ మంత్రి హరీశ్‌రావు ఆయనను పరామర్శించారు. పోచయ్య మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. హరీశ్‌రావు వెంట మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ జడ్పీటీసీ దువ్వల మల్లయ్య, మాజీ సర్పంచులు శ్రీనివాస్, అజీద్, నాయకులు రవీందర్ రెడ్డి, పుప్పాల నారాయణ, నార్లపురం రామ్మోహన్ తదితరులు ఉన్నారు.


ఎంపీటీసీ బాబును పరామర్శిస్తున్న హరీశ్‌రావు